క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండ

- మంత్రి మేరుగు నాగార్జున



బుజ్జమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న నూకతోటి రాజేష్ తల్లి బుజ్జమ్మ హైబీపీతో ఆస్పత్రిలో చేరి పరిస్థితి విషమించి సోమవారం మరణించింది. విషయం తెలుసుకున్న మంత్రి మేరుగు నాగార్జున మండల నాయకులతో కలిసి బుజ్జమ్మ మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించి రాజేష్‌కు ధైర్యం చెప్పారు. బుజ్జమ్మ కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సినవన్నీ త్వరగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులను ఆదేశించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, పోలవరపు శ్రీమన్నారాయణ, కంచర్ల సుధాకర్, యోహాను ఉన్నారు.

ఏపీ ఫిషరీస్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి

ఒంగోలు సెంట్రల్: ఏపీ ఫిషరీస్ టేబుల్ క్యాలెండర్‌ను ఆ శాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మత్స్య శాఖలో నూతనంగా ఏర్పడిన ఏపీ ఫిషరీస్ ఏఐఎఫ్, ఎఫ్ఎం, ఎఫ్ఎస్ఎం అసోసియేషన్ల సహకారంతో క్యాలెండర్ రూపొందించినట్లు సంఘ బాధ్యులు గౌరీశంకర్, రాములు తెలిపారు.

దాతల సహకారంతో వంటగదికి శంకుస్థాపన



వంటగదికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: దాతల సహకారంతో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో వంట గది నిర్మాణానికి డాక్టర్ బీ జవహర్ సోమవారం శంకుస్థాపన చేశారు. హైస్కూల్లో 1967–68 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రొఫెసర్ చలువాది వెంకటేశ్వరరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థుల సౌకర్యార్థం వంటశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, హెచ్ఎం సుబ్రహ్మణ్యం దాతలను అభినందించారు.

రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డుకు శంకుస్థాపన



గ్రావెల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్ట 40వ డివిజన్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో స్థానిక డివిజన్‌లో ఇప్పటికే రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ వెంటనే అమలు చేయాలి

ఒంగోలు సబర్బన్: ఈపీఎఫ్ టూ జీపీఎఫ్‌ను ఉద్యోగంలో చేరిన వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–1104 నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ 74వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక రాంనగర్‌లోని విద్యుత్ భవన్ ముందు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడు, 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి రాచగర్ల సంజీవరావుతో కూడిన యూనియన్ నాయకులు తొలుత అమరులైన యూనియన్ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఏకైక యూనియన్ 1104 అని అన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- వచ్చే ఎన్నికల్లో టీడీపీని మట్టి కరిపించాలి
- మంత్రి మేరుగు నాగార్జున పిలుపు



గాజులపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: రాబోయే ఎన్నికల్లో టీడీపీని మట్టికరిపించి బంగాళాఖాతంలో పడేయడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మద్దిపాడు మండలంలోని కీర్తిపాడు పంచాయతీ పరిధిలో గల గాజులపాలెం గ్రామంలో నాయకులతో సోమవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు పొత్తులు లేకుండా ఇప్పటి వరకూ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీచేయలేదని, అతనికి అతనిపై నమ్మకం లేక జిత్తులు ప్రదర్శిస్తున్నాడని విమర్శించారు. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు జనసేన, మరోవైపు బీజేపీ, ఇంకోవైపు వామపక్షాలను కూడా కలుపుకోవడానికి చంద్రబాబు వెనకడుగు వేయడం లేదన్నారు. అవకాశం లేకగానీ.. ఉంటే తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలతో కూడా పొత్తు పెట్టుకోవడానికి చంద్రబాబు వెనకాడడని ఎద్దేవా చేశారు. జగన్‌ను ఢీకొట్టలేక చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తు పెట్టుకుని ఆ తర్వాత విడిపోయి బీజేపీని తిట్టిన సంగతి ప్రజలకు తెలుసన్నారు. మరోమారు బీజేపీతో పొత్తు కోసం దిగజారి ఆ పార్టీ నాయకుల కాళ్లు పట్టుకునే పరిస్థితి చంద్రబాబుకు వచ్చిందన్నారు. ప్రజలు రాజకీయ అవగాహన కలిగి ఉన్నారని, ఎవరు ఎన్ని జిత్తులు వేసినా మరోసారి జగనే ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. ప్రజలు టీడీపీని విశ్వసించడం లేదని తెలిపారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న వ్యక్తి తన పదవీ కాలంలో ఏదైనా ప్రజలకు ఉపయోగపడే పని చేశానని చెప్పుకునే పరిస్థితి కూడా లేదని మంత్రి మేరుగు విమర్శించారు. మాట్లాడితే హైదరాబాదును తానే నిర్మించానని, ఒలింపిక్స్ హైదరాబాదులో పెట్టిస్తానని.. నమ్మశక్యం కాని మాటలతో బురిడీ కొట్టించడానికి ఒక బురిడీ బాబాలా చంద్రబాబు తయారయ్యారని అన్నారు. ఆయనకు తోడు దత్తపుత్రుడు సీట్ల సంఖ్య గురించి మాట్లాడకుండా జనసైనికులను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్నాడని విమర్శించారు. ఒకసారే నమ్మడం కష్టమైతే.. చంద్రబాబు మాత్రం ప్రజలను మూడు సార్లు మోసం చేసి గద్దెనెక్కాడని అన్నారు. ఒకసారి రుణమాఫీ అని, అంతకుముందు మహిళలకు దీపం పథకమని.. రకరకాల మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టిన సంగతి జనం బాగా గుర్తుంచున్నారని అన్నారు. ఈసారి ఆయన మాయమాటలు నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరని, టీడీపీని చాపచుట్టి విసిరి బంగాళాఖాతంలో వేస్తారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు గుడ్లపాతల రవి, అన్వేష్, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, రామాంజనేయులు, తేళ్ల పుల్లారావు, బొమ్మల ఏసుదాసు, గ్రామ నాయకులు తిప్పారెడ్డి కోటిరెడ్డి, బడే అంజిరెడ్డి, దాకా కోటిరెడ్డి, వేలమూరి మణికంఠరెడ్డి, కురుగుంట్ల సుబ్బారెడ్డి, చిట్యాల కృష్ణారెడ్డి, తదితర నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకుడిని పరామర్శించిన మంత్రి మేరుగు...

మండలంలోని రాచవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రంకెల మల్లయ్య కుమారుడు లక్ష్మీనారాయణ అలియాస్ సన్నీ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించారు. మల్లయ్య కుటుంబ సభ్యులను మంత్రి మేరుగు నాగార్జున పరామర్శించి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

- అధికారులు, ప్రజాప్రతినిధులతో ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు రూరల్: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి కోరారు. ఒంగోలు మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కన్వీనర్‌గా వ్యవహరించగా, పలుశాఖల అధికారులు పాల్గొని వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు మాట్లాడుతూ... జిల్లా పరిషత్ నిధుల కింద 11 పనులను కోటి రూపాయల వ్యయంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం రూరల్‌లో 65 పనులకుగానూ 8 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. చేతిపంపులు 240 మంజూరు చేసినట్లు చెప్పారు. కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందరప్రసాద్, విద్యుత్ శాఖ ఇంజినీర్ చెన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ కిషోర్‌బాబు, ఏపీఎం గోపీనాథ్, పీఆర్ ఏఈ శేషగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి, మత్స్యశాఖ అధికారిణి ఆశాలత, విద్యాశాఖ ఎంఈఓ 2 సరస్వతి, హౌసింగ్ ఏఈ పృథ్వి ఆయా శాఖల గురించి వివరించారు. వైస్ ఎంపీపీలు డి.ఉషారాణి, వాణి, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొనగా, పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పందన అర్జీలు అధిక ప్రాధాన్యంతో పరిష్కరించాలి

- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



స్పందన నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీల తాలూకు సమస్యలను అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్పందన హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో సుమారు 250 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు నిర్ణీత గడువులో పరిష్కరించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యలపై ప్రజలు కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పకుండా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అర్జీలు పరిష్కారం చేయలేని పక్షంలో కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్, ఝాన్సీలక్ష్మి, మాధురి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- రైతులకు శిక్షణ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి రామకృష్ణ

ఒంగోలు సెంట్రల్: పొగాకు రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన పొగాకు ఉత్పత్తికి కృషి చేయాలని ఒంగోలు–2 వేలం కేంద్రం వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ కోరారు. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో సోమవారం పొగాకు రైతులకు ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్, సుస్థిరమైన పొగాకు సాగులో చేపట్టాల్సిన మెళకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐటీసీ ప్రతినిధి యశ్వంత్, జీపీఐ ప్రతినిధి కళ్యాణ్, పీఎస్ఎస్‌హెచ్ ప్రతినిధి రామాంజనేయులు, బోర్డ్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రైతు సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ కొరియా విశ్వవిద్యాలయంతో క్విస్ కాలేజీ ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న క్విస్ కాలేజీ యాజమాన్యం

ఒంగోలు: దక్షిణ కొరియాలోని డేజియాన్‌లో ఉన్న వూసాంగ్ విశ్వవిద్యాలయంతో స్థానిక క్విస్ కాలేజీ యాజమాన్యం సోమవారం అధికారిక అవగాహన ఒప్పందాన్ని చేసుకుంది. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా గ్లోబల్ భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్నట్లయిందన్నారు. దక్షిణ కొరియాలోని టాప్ 5 ప్రైవేటు యూనివర్శిటీలలో ఒది ఒకటి అని, సంస్థ గ్లోబల్ ఔట్‌రీచ్, డెవలప్‌మెంట్ ప్రయత్నాలలో గణనీయమైన పురోగతిని సూచిస్తుందని అన్నారు. విద్యా నైపుణ్యాలు పెంపొందించడంలో, అంతర్జాతీయ పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంలో దాని కీలకపాత్రను వివరించారు. ఈ భాగస్వామ్యం భారతదేశం జాతీయ విద్యావిధానం 2020 ఆదేశాలకు కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సహకారాలలో నూతన బెంచ్ మార్క్‌ను నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



మహిళల ఖోఖో విన్నర్స్



మహిళల కబడ్డీ రన్నర్స్



మహిళల క్రికెట్ తృతీయ స్థానం


ఆడుదాం ఆంధ్రాలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ఒంగోలు: వైజాగ్‌లో సోమవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు కబడ్డీలో ద్వితీయ స్థానం, క్రికెట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు.

రథసప్తమి కరపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఈ నెల 16వ తేదీ రథసప్తమి పర్వదిన కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను సోమవారం రాత్రి ఆవిష్కరించారు. దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు పాల్గొని మాట్లాడుతూ రథసప్తమి ప్రాతఃకాలమున శ్రీ ప్రసన్నచెన్నకేశవస్వామివారికి సప్త వాహనాలపై నగరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలు చరిత్రలో 70 సంవత్సరాల తర్వాత స్వామి వారు రథంపై భక్తులకు దర్శనమిస్తారన్నారు.

బాలోత్సవం పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల సత్తా



ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలోత్సవం పోటీల్లో ఒంగోలు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 14 విభాగాల్లో విద్యార్థులు బహుమతులు కైవసం చేసుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ శబరీనాథ్ తెలిపారు. సబ్‌జూనియర్స్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో రెండో తరగతి విద్యార్థిని స్పందన ద్వితీయ బహుమతి, ఇంగ్లిషు రైమ్స్ పోటీల్లో మూడో తరగతి విద్యార్థి రోహన్‌రాజ్ (ద్వితీయ), కార్టూన్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని చందన (ప్రథమ), ఉర్దూ వ్యాసరచన పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని రబియా (ద్వితీయ), 9వ తరగతి విద్యార్థిని మలిహ ఫాతిమా (తృతీయ), జూనియర్స్ విభాగంలో ఉర్దూ వక్తృత్వ పోటీల్లో 6వ తరగతి విద్యార్థిని వాఫికభాను (ప్రథమ), సీనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని షీఫా (ప్రథమ), స్పెల్‌బీ పోటీల్లో 7వ తరగతి విద్యార్థి విహారి (ద్వితీయ), మట్టిబొమ్మలు తయారుచేసే పోటీల్లో 9వ తరగతి విద్యార్థి భద్ర, భాస్కర్ (ప్రథమ), ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని హాసిని (ద్వితీయ), సంప్రదాయ నృత్యం పోటీల్లో 8వ తరగతి విద్యార్థి దవళాక్షి (ప్రథమ), సాహితీతేజ, జాహ్నవి, సృజిత, సిరి అక్షితలు ప్రదర్శించిన లఘునాటికకు తృతీయ బహుమతి లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులను కరస్పాండెంట్ శబరీనాథ్ అభినందించారు.

టీడీపీ..జయహో బీసీ సభ అట్టర్ ఫ్లాప్

- వేదిక మీదకే పరిమితమైన బీసీ నాయకులు, టీడీపీ సామాజికవర్గంతో పాటు ఇతర వర్గాలకు చెందిన వారు
- ఇస్తానన్న డబ్బులు ఇవ్వకపోవటంతో మధ్యలోనే వెళ్లిపోయిన జనాలు
- బీసీలకు జనార్దన్‌తో పాటు టీడీపీ ఏం చేసిందంటూ అసహనం



పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న దామచర్ల, ఇతర బీసీ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో సోమవారం నిర్వహించిన టీడీపీ జయహో బీసీ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. స్థానిక పీఏజీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన జయహో బీసీ సభలో కేవలం వేదికమీదనే బీసీ నాయకులు ఉన్నారు. ఫంక్షన్ హాలులో మాత్రం టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వాళ్లే హాజరయ్యారు. అది కూడా కావాలని తరలించారు. జనసేన అధినాయకుని సామాజికవర్గానికి చెందిన వారిని కూడా బలవంతంగా తీసుకొచ్చారు. కనీసం ఫంక్షన్ హాలు కూడా నిండకపోవటంతో ఫోన్లు చేసి మరీ పార్టీ కార్యకర్తలను పిలిపించుకున్నారు. ఇదిలా ఉంటే కొందరిని ఒక్కొక్కరికి రూ.500 ఇస్తామని చెప్పిమరీ బలవంతంగా తీసుకొచ్చారు. అయితే ముందుగా ఇస్తామని చెప్పి ఇవ్వకపోవటంతో సభ ప్రారంభానికి ముందే వారు వెళ్లిపోయారు. మరికొందరైతే బీసీలమని చెప్పుకుంటున్న పార్టీలోని టీడీపీ నాయకులు నూకసాని బాలాజీ కానీ, వైవీ.సుబ్బారావు కానీ బీసీల్లా కాకుండా అగ్రవర్ణాల నేతల్లా వ్యవహరిస్తున్నారని కొందరు అసహనం వ్యక్తం చేసుకుంటూ వెళ్లిపోయారు. టీడీపీ కానీ, మాజీ ఎమ్మెల్యే జనార్దన్ కానీ బీసీలకు ఏమి ఒరగబెట్టారంటూ నేరుగా సమావేశంలోనే మాట్లాడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

ఆడిట్ సిబ్బందికి సహకరించాలి



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి ఝాన్సీ

నాగులుప్పలపాడు: 2022–23 ఏడాదిలో మండల వ్యాప్తంగా జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌కు ఉపాధి పథకం సిబ్బంది అంతా సహకరించాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం సిబ్బంది, టీఏలు, ఎఫ్ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆడిట్‌కు సంబంధించిన రికార్డులన్నీ సోమవారం సాయంత్రం లోపు ఆడిట్ టీంకు అందజేయాలని ఆదేశించారు. ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీవోలు రవి, ధనుంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

1,050 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న కృష్ణ నేత్రాలయ డాక్టర్లు

కొత్తపట్నం: కృష్ణ నేత్రాలయ హాస్పిటల్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 1,050 మందికి సోమవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్ష క్యాంప్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా, వారిలో 123 మందికి వివిధ రకాల సమస్యలున్నట్లు గుర్తించారు. వివిధ పరికరాలతో పరీక్షలు చేయాలని, ఒంగోలు హాస్పిటల్‌కు రావాలని కోరారు. కార్యక్రమానికి భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ తన్నీరు బాలాజీ, జిల్లా స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు, కృష్ణ నేత్రాలయ డాక్టర్లు వాకా రాజశేఖర్‌రెడ్డి, సువర్ణరేఖ, శ్రావణి, లావణ్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు రూరల్ తహసీల్దార్



బాధ్యతలు స్వీకరిస్తున్న రూరల్ తహసీల్దార్ డానియల్‌తో అర్బన్ తహసీల్దార్ సృజన్‌కుమార్

ఒంగోలు రూరల్: ఒంగోలు రూరల్ మండల నూతన తహసీల్దార్‌గా ఎం.డానియల్ సోమవారం ఉదయం 10 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఒంగోలు మండలానికి ఆయన నియమితులయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఒంగోలు తహసీల్దార్ కార్యాలయాన్ని అర్బన్, రూరల్‌గా విభజించాలని గతంలో ఉన్నతాధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌గా సృజన్‌కుమార్ నియమితులైన బాధ్యతలు చేపట్టగా, రూరల్ తహసీల్దార్‌గా డానియల్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్లను కలిసిన వారిలో ఒంగోలు వ్యవసాయాధికారి కిశోర్‌బాబు, ఎలక్షన్ డీటీ బాషా, ఎలక్షన్ కార్యాలయ సిబ్బంది, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పశుపోషకులకు మార్గదర్శకులు.. కాటంరాజు

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ బొట్ల రామారావు యాదవ్



మాట్లాడుతున్న బొట్ల రామారావు యాదవ్

ఒంగోలు సెంట్రల్: పశుపోషకులకు మార్గదర్శకులైన కాటంరాజు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ బొట్ల రామారావుయాదవ్ కోరారు. స్థానిక గొర్రెల కాపరుల సమావేశపు మందిరంలో సోమవారం కాటంరాజు జయంతి నిర్వహించారు. రాష్ట్ర షీప్ ఫెడరేషన్ చైర్మన్ ప్రకాశ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పశు, జంతు ప్రేమికులుగా ఉండాలని, మూగజీవాల ఆవేదనను గమనించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల రామారావు యాదవ్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులు ప్రసిద్ధి చెందడానికి కాటంరాజే కారణమని చెప్పారు. భవిష్యత్ తరాల రీత్యా మేలైన సంతానోత్పత్తి సామర్థ్యం కలిగిన పశుసంపదను సృష్టించడానికి శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్ర షీప్ ఫెడరేషన్ చైర్మన్ ప్రకాశ్ యాదవ్ మాట్లాడుతూ కాటంరాజు జయంతిని జాతీయ పశుపోషణ దినోత్సవంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని కోరారు. కనిగిరి కొండపై ఉన్న కాటంరాజు కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, జిల్లాలో కాటంరాజు కారిడార్, జాతీయ పశువైద్యశాల ఏర్పాటు చేసి రెండు వందల అడుగుల కాటంరాజు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. పొదిలి కేంద్రంగా ఏడు శాసనసభ నియోజకవర్గాలను కలిపి కాటంరాజు జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎస్‌డీపీఈడీ వెంకటరామిరెడ్డి, డాక్టర్ భరత్ పాల్గొన్నారు.